క్లుప్తంగా

అందరూ ఆరోగ్యంగా ఉండాలి



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగార్జున

తాండూరు రూరల్: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని కోటబాసుపల్లి సర్పంచ్ నాగార్జున అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటివెలుగు శిబిరం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కంటి పరీక్షల తరువాత మందులతో పాటు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, నాయకులు వీరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, సురేష్, భాస్కర్, మొగులప్ప, సావిత్రమ్మ, విగ్నేశ్, నారాయణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భారీగా విరాళాలు

ధారూరు: ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భారీగా విరాళాలు వస్తున్నాయి. నాగారం గ్రామంలో ఏర్పాటు చేయనున్న విగ్రహానికి సోమవారం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి రూ.51 వేలు, వడ్లనందు ఫౌండేషన్ చైర్మన్ నందు రూ. 21 వేలు, నాగారం ఎంపీటీసీ మొగిలి స్వేత భర్త నరోత్తమ్‌రెడ్డి రూ.25 వేలు, తెలంగాణ ఉద్యమకారుడు రాజేందర్‌రెడ్డి రూ.21 వేలు, నాగారం సర్పంచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.10 వేలు, బీఆర్ఎస్ నాయకుడు వీరేందర్‌రెడ్డి రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ యువజన సంఘం నాయకులు దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

గొల్లకుర్మలను ఆదుకోండి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ మంజుల తదితరులు

తాండూరు రూరల్: తమను ఆదుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డిని గొల్లకుర్మలు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో తాండూరు జెడ్పీటీసీ గౌడి మంజుల వెంకటేశం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను గొల్లకుర్మలు కలిసి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుర్మ సంఘానికి ప్రభుత్వం ఐదు ఎకరాల భూమి కేటాయించాలని, ప్రమాదవాశాత్తు గొర్ల కాపరులు చనిపోతే బీమా కల్పించాలని కోరారు.

ఇంటర్నల్ నోట్స్ పరిశీలన



నోట్ బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ

బంట్వారం: పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ నోట్ బుక్స్‌ను ఎంఈఓ చంద్రప్ప సోమవారం పరిశీలించారు. జెడ్పీహెచ్ఎస్ బంట్వారం, తొర్మామిడి పాఠశాలతో పాటు.. మోడల్ స్కూల్, కేజీబీవీలను ఎంఈఓ సందర్శించి నోట్ బుక్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శారద, శ్రీనివాస్, ఉపాధ్యాయులు తుకారామ్, నగేష్, అరవింద్, యాదమ్మ, సుజాత, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

మండల విద్యాధికారి హరిశ్చందర్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

పరిగి: ప్రతి విద్యార్థిని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యనందించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. మండల పరిధిలోని చిట్యాల తదితర ఉన్నత పాఠశాలలను సోమవారం సందర్శించి, విద్యార్థులకు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలంటే.. అది కేవలం ఉపాధ్యాయుల వల్లే సాధ్యమన్నారు. కావున ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'హరిత'.. హననం!

- నాటడం.. వదిలేయడం
- సంరక్షణ మరిచిన అధికారులు
- కాలి బూడిదవుతున్న మొక్కలు
- బాధ్యత మీదంటే మీదేనంటున్న సర్పంచులు, 'ఉపాధి' అధికారులు



ఎల్లకొండ గ్రామం వద్ద గడ్డితో పాటు కాలిపోయిన మొక్కలు (ఫైల్)

నవాబుపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హరితహారం నిర్లక్ష్యానికి గురవుతోంది. హరిత హారం పేరుతో ఏటా మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. వాటి సంరక్షణ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. నాటిన మొక్కలకు నీరందక వాడిపోతున్నా.., అగ్ని కీలలకు ఆహుతవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో సర్కారు లక్ష్యం నీరుగారిపోతుందని వాపోతున్నారు. అవెన్యూప్లాంటేషన్ పేరుతో ఏటా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రహదారుల వెంబడి వేల సంఖ్యలో మొక్కలు నాటుతున్నారు. కానీలా తరువాత వాటి పర్యవేక్షణ మరిచారు. నిత్యం ఎక్కడో ఓ చోట కారణమేదైనప్పటికీ.. మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నా అధికారుల్లో ఎటువంటి కదలిక రావడం లేదు. నవాబుపేట మండలంలోని అక్నాపూర్, ఆర్కతల, అత్తాపూర్, చించల్‌పేట, చిట్టిగిద్ద, ఎత్‌రాజ్‌పల్లి, గంగ్యాడ గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా 11 వేల మొక్కలు నాటారు. కానీ వాటిని పట్టించుకోవడం లేదు. మొక్కల చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డిగాదం పెరిగిపోయింది. పిచ్చిమొక్కల తొలింగింపు, నీరు పోయడం మరచిపోయారు. ఇలా మొక్కల చుట్టూ పెరిగిన గడ్డిని తొలగించక పోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిని తగలబెడుతున్నారు. ఇటీవల ఎల్లకొండ, లింగంపల్లి, పులుమామిడి, గొల్లగూడ, నారెగూడ, మాదిరెడ్డిపల్లి, వట్టిమీనపల్లి గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలు కాలిబూడిదయ్యాయి. ఇలా నిత్యం జరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే లేరని, మొక్కల పెంపకం పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోందని మండల ప్రజలు వాపోతున్నారు.

బాధ్యత మీదంటే మీదే..

మొక్కలకు నీళ్లు పోయడం, పిచ్చి మొక్కలు తొలగించడం, రోడ్లకు ఇరువైపులా గడ్డిని కోపియ్యడం ఉపాధిహామీ వారు చూసుకోవాలని పలువురు సర్పంచులు అంటుండగా.. ఉపాధిహామీ అధికారులు మాత్రం గ్రామ పంచాయతీలదే బాధ్యత అంటున్నారు. ఉపాధిహామీ నుంచి 400 మొక్కలకు ఒక కూలీని పెట్టి, కేవలం మొక్క చుట్టూ మీటర్ వరకు మాత్రమే పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయిస్తాము. మిగిలిన గడ్డిని, పిచ్చి మొక్కలను తొలగించి నీరు పోయించాల్సిన బాధ్యత జీపీలదేనని అధికారులు చెబుతున్నారు. ఇలా ఒకరిపై ఒకరు బాధ్యత మీదంటే మీదేనంటూ మొక్కలను నిర్లక్ష్యానికి గురిచేస్తూ.. మొక్కలను బుగ్గిపాలు చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే ఆశీస్సులతో అభివృద్ధి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న వెంకట్ తదితరులు

మోమిన్‌పేట: గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ అన్నారు. సోమవారం మోమిన్‌పేటలో రూ.40 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీల నిర్మాణ పనులను సర్పంచ్ అంగేరి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, ఎంపీ రంజిత్‌రెడ్డిల ఆశీస్సులతో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని, ప్రతి చిన్న గ్రామానికి కూడా అధిక మొత్తంలో నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో భూగర్భ మురుగు కాల్వలు, సీసీల నిర్మాణాలు చేసుకొని గ్రామాలు స్వచ్ఛతను చాటుతున్నాయని ఆయన తెలిపారు. నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచు నరేష్, కార్యదర్శి నర్సింహులు, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- ఆర్డీఓ విజయకుమారి



రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ విజయకుమారి

మోమిన్‌పేట: భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం చేపట్టినట్లు ఆర్డీఓ విజయకుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు పరిష్కరించేందుకు తగిన సలహాలు, సూచనలు ఇస్తామని ఆమె చెప్పారు. రైతులు తగిన ఆధారాలతో ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులో పేర్కొన్న సమస్యను రికార్డుల ఆధారంగా పరిశీలించి, కలెక్టర్‌కు నివేదిస్తామని వెల్లడించారు. ప్రజావాణిలో 15 ఫిర్యాదులు అందినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, రైతులు తదితరులు ఉన్నారు.

పది ఫిర్యాదులు

వికారాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో పట్టణ ప్రజల నుంచి పది ఫిర్యాదులు అందాయని కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. ఫిర్యాదులపై తక్షణం స్పందించి.. సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

సమాజ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి
- న్యాయ సేవా అధికార సంస్థ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటేశ్

అనంతగిరి: విద్యార్థులు చట్టాలపై తగిన అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్ అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని విశ్వభారతి డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో విద్యార్థులు.. తెలియని వారికి తెలియని విషయాలపై అవగాహన కల్పించాలని, సమాజ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్ రాము, న్యాయవాదులు రాజశేఖర్, నర్సింహులు కళాశాల యాజమాన్యం సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

కుల్కచర్ల: విద్యార్థుల భవిష్యత్తుకు తల్లితండ్రులు కృషి చేయాలని పరిగి ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో న్యూ రవీంద్ర భారతి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే.. వారిపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఆచార వ్యవహారాలు, దేశభక్తి భావాలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఎన్‌పీఎస్ వ్యవస్థాపకులు రాఘవేందర్‌గౌడ్, పాఠశాల కార్యదర్శి వెంకటరాములు, ఎంపీటీసీ జ్యోతి, ఉపాధ్యాయులు వెంకటయ్య, నర్సింహులు, మొగులయ్య, ఆంజనేయులు, విద్యార్థి తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

సహజసిద్ధమైన రంగు.. మోదుగు పువ్వులు



మోదుగుపువ్వుతో చిన్నారులు

తాండూరు: హోలీ పండగ అంటే చిన్నాపెద్దా, పేద, ధనిక తేడా లేకుండా జరుపుకొనే ఉత్సవం. హోలీ సందర్భంగా పల్లెల్లో దొరికే సహజసిద్ధమైన మోదుగు చెట్టు నుంచి వచ్చే పువ్వును రంగుల్లో వాడతారు. చిన్నారులు మోదుగు పువ్వును తీసుకొచ్చి బాగా రంగరించి నీటిలో కలిపి రంగు నీరుగా మార్చుకుంటారు. వాటిని ఒకరిపై ఒకరు చల్లుకుంటూ కేరింతలు కొడతారు. మోదుగు పువ్వు నుంచి తయారు చేసిన రంగు వలన ఎలాంటి హానీ జరగదని ప్రజలు నమ్ముతారు.

'కంటి వెలుగు' పేదలకు వరం

శంకర్‌పల్లి: కంటి వెలుగు కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగపడుతోందని గోపులారం సర్పంచ్ పొడువు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని గోపులారంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఏఓ రజితకు మెమో జారీ

సాక్షి ఎఫెక్ట్..

తాండూరు రూరల్: 'రైతు వేదిక ఉపయోగం లేక' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. రైతు వేదికల నిరుపయోగంపై ఏడీ రుద్రమూర్తి సోమవారం ఆరా తీశారు. ఇదే విషయమై.. వ్యవసాయశాఖ తాండూరు మండల ఏఓ రజితకు మెమో జారీచేసినట్లు ఏడీఏ తెలిపారు. మండలంలో ఉన్న అన్ని రైతు వేదికలను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అక్కడి సౌకర్యాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

'మాఊరిలో తాగునీరు కలుషితం కాలేదు'



బొంరాస్‌పేట: గ్రామస్తులతో నీటి సమస్య గురించి మాట్లాడుతున్న కార్యదర్శి సువర్ణ

బొంరాస్‌పేట: మండల పరిధి వడిచర్లలో మిషన్ భగీరథ నీరు తాగడానికి సురక్షితంగా లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో 'భగీరథ.. ఇదేం వ్యథ' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో జీపీ కార్యదర్శి సువర్ణ, ఉపసర్పంచు సిద్దు.. ఉదయాన్ని గ్రామాన్ని సందర్శించారు. తమ గ్రామంలో తాగునీరు కలుషితం కావడం లేదని చెప్పారు. గ్రామానికి సరఫరా అవుతున్న భగీరథ జలాలు అంతకుముందు గ్రామాల్లోనే కలుషితమయినట్లు అనుమానించారు. గ్రామానికి సరఫరా అయ్యే మేయిన్ పైప్‌లైన్ ద్వారా ఏనెమీదితండా, కొత్తూరు గ్రామాల శివారులో పైప్‌లైన్ లీకేజీ అవుతున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సీడీపీఓ వెంకటేశ్వరమ్మ



మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

పూడూరు: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీఓ వెంకటేశ్వరమ్మ అన్నారు. మహిళాదినోత్సవం సందర్భంగా సోమవారం మండల పరిధిలోని మన్నేగూడ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలను సన్మానించారు. ప్రతి ఒక్కరు పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. అన్ని రంగాల్లో రాణించాలంటే ముందుగా ఆరోగ్యం ముఖ్యమన్నారు. గర్భిణులు పోషకాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. తప్పని సరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కళావతి, గర్భిణులు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే.. వరంగల్ డిక్లరేషన్ అమలు

- రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం
- డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి



సిరిగాయపల్లి సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం మండల పరిధిలోని కెరవెళ్లి, సిరిగాయపల్లి గ్రామాల్లో హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు భరోసా కల్పించడమే హాత్‌సే హాత్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. యువనేత రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్‌ను పక్కాగా అమలు చేసేలా ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను వివరిస్తున్నామని తెలిపారు. రూ.500 లకే వంట గ్యాస్, సొంత స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలతో డబుల్ బెడ్‌రూం ఇండ్లు, రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించనునన్నట్లు చెప్పారు. అవసరం ఉన్న రైతులు అసైన్డ్ భూములు అమ్ముకునేలా చట్టం తెస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్, నాయకులు జమీల్, జహంగీర్, నర్సింహులు, వీరేష్, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్లు త్వరగా నిర్మించండి..

- సకాలంలో బిల్లులు పొందండి
- ఎంపీడీఓ శైలజారెడ్డి



సీసీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజారెడ్డి తదితరులు

మోమిన్‌పేట: ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ శైలజారెడ్డి చెప్పారు. సోమవారం మండల పరిధిలోని ఏన్కేపల్లిలో కొనసాగుతున్న రోడ్డు పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ లోపు సీసీ పనులు పూర్తి చేయాలన్నారు. మార్చి 31లోపు ఎంబీలు పూర్తి చేసుకొని, ఎఫ్టీఓలు జనరేట్ చేయించుకోవాలని చెప్పారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు.. ఏప్రిల్ ఈ ఆర్థిక తొలి మాసం కావడంతో తొందరగా విడుదల అవుతాయని ఆమె తెలిపారు. సీసీల నిర్మాణ పనులు ఆలస్యం అయ్యే కొద్దీ నిధుల విడుదలలో జాప్యం జరుగుతుందని చెప్పారు. కావున పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఆమె సూచించారు. రోడ్ల నిర్మాణ పనులు చేపట్టే మేస్త్రీలు దొరకడం లేదని, ఉన్న వారితోనే రేయింబవళ్లు పనులు చేయించుకోవాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అంతమ్మ, కార్యదర్శి తిరుపతమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ అడివిరెడ్డి, నాయకులు మల్లయ్య, మైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

10 జీపీఏ సాధిస్తే రూ.10 వేలు

ధారూరు: 10వ తరగతి పరీక్షల్లో ఎవరైనా విద్యార్థులు 10 జీపీఏ సాధిస్తే రూ.10 వేలు నగదు బహుమతి అందజేస్తామని ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి చెప్పారు. నాగారం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వడ్లనందు ఫౌండేషన్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను ఆమె అందజేసి మాట్లాడారు. పాఠశాలకు ప్రహరీని నిర్మిస్తామని, కొత్తగా గేట్ ఏర్పాటు చేపిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్లనందు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



మొక్కలు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: మొక్కల సంరక్షణపై ప్రత్యేక కార్యచరణ రూపొందించామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ చెప్పారు. సోమవారం పట్టణ కేంద్రంలోని పలు కాలనీల్లోని పార్కులను సందర్శించి, మొక్కలకు నీరు పట్టారు. అనంతరం మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్క బతికేలా మున్సిపల్ సిబ్బందితో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హరితహారంలో భాగంగా పార్కుల్లో నాటిన మొక్కలు చనిపోతే.. వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటి సంరక్షణ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మొక్కల పర్యవేక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని రేయిన్‌బో పాఠశాలలో సోమవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకులు, అధికారులుగా విద్యార్థులు విధులు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా స్నేహ, ఎంఈఓగా స్వాతి, డీఈఓగా శివరాంతో పాటు 20మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పారు. ప్రతిభ కనబర్చిన చరణ్, సాహితీ యాదవ్, త్రిశాంత్‌లకు కరస్పాండెంట్ రాఘవేందర్ యాదవ్, ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హైమద్, అన్వర్, పార్వతీ, కవిత, సనా, యాదమ్మ, సాగరిక, శ్వేత, స్వరూప పాల్గొన్నారు.

అవమానిస్తున్న అధికారులు!

- అభివృద్ధి పనుల సమాచారం ఇవ్వడం లేదు
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అనురాధ మండిపాటు
- డబ్బులు ఇస్తేనే అభివృద్ధి పనులు చేస్తాం: సర్పంచులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు శంకర్ తదితరులు

పెద్దేముల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా.. ఎంపీటీసీలకు అధికారులు సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ అనురాధ ఆరోపించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న పనుల గురించి ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇవ్వకుండా తమను అవమానిస్తున్నారని మండిపడ్డారు. సమాచారం ఇవ్వకుండా పనులు చేపట్టడం ఎంత వరకు న్యాయమన్నారు. సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ పంచాయతీ ఏర్పడి నాలుగేళ్లు దాటినా నేటికీ పంచాయతీకి భవనం లేదని, వెంటనే భవనం మంజురు చేయాలని డిమాండ్ చేశారు. మంబాపూర్ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాల్లో వేస్తున్న సీసీరోడ్లు నాణ్యత లేక.. మున్నాళ్లకే పాడైనా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని, వాటిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తట్టెపల్లి–అడ్కిచెర్ల రహదారి పూర్తికాక, దుమ్ము ధూళితో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని, ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పనులకు ఎంపీటీసీలకు తెలియకుండా చేయడం ఎంత వరకు న్యాయమని తట్టెపల్లి ఎంపీటీసీ సభ్యుడు శంకర్, ఎంపీపీ అనురాధ ప్రశ్నించారు.

అధికారులకు మెమోలు జారీ..

మూడు నెలలకు ఓ సారి జరిగే మండల సర్వసభ్య సమావేశాలకు హాజరు కాని పలు శాఖల అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీపీ అనురాధ ఎంపీడీఓ లక్ష్మప్పను కోరారు. అదే విధంగా సమావేశం పూర్తికాక ముందే మధ్యలో వెళ్లి పోయిన అధికారులకు మెమోలతో పాటు కలెక్టర్‌కు సమాచారం అందజేయాలని డిమాండ్ చేశారు.

పైసలిస్తేనే పనులు..

ఈ నాలుగేళ్ల పాలనలో చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాక, తాము చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక అప్పుల పాలవుతున్నామని, ఈ విషయాన్ని ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు సర్పంచులు వాపోయారు. పనులు మంజూరైన సమయంలో అధికారులు వచ్చి నిధులు సిద్ధంగా ఉన్నాయని, పనులు చేసిన వెంటనే డబ్బులు ఇస్తామని చెప్పి.. పనుల అనంతరం అధికారులు మాయమవుతున్నారని ఆరోపించారు. దీంతో అప్పుల బాధపడలేక చివరకు ఉన్న ఎకరా భూమి కూడా అమ్ముకోవాల్సి వస్తుందని మంబాపూర్, ఖాజాపూర్ సర్పంచ్‌లు రమేష్, శ్రావణ్‌కుమార్‌లు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ముందు డబ్బులు మంజూరు చేసిన తరువాతనే పనులు చేపడతామని సర్పంచ్‌లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మధులత, ఎంపీడీఓ లక్ష్మప్ప, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, ఏపీఓ షేక్ సుష్మా, ఏపీఓ లక్ష్మిదేవి, అధికారులు పాల్గొన్నారు.